

'గులాబీ'లో ఎమ్మెల్సీ టికెట్ టెన్షన్..


వాసుదేవరెడ్డి


సుందర్‌రాజ్


రాకేశ్‌రెడ్డి



- 2007 నుంచి నాలుగు పర్యాయాలు ఎగిరిన బీఆర్ఎస్ జెండా
- తెరపైకి సుందర్‌రాజ్, వాసుదేవరెడ్డి, రాకేశ్‌రెడ్డి తదితరుల పేర్లు
- నేడు వరంగల్‌లో కేసీఆర్ రోడ్‌షో
- అనంతరం ఎంపీ అభ్యర్థి గెలుపు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై చర్చించే అవకాశం

వరంగల్, నల్లగొండ, ఖమ్మం అభ్యర్థిత్వానికి పోటాపోటీ

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పట్టు సాధించేందుకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను అభ్యర్థిగా ప్రకటించటంతో బీఆర్ఎస్ తమ అభ్యర్థి ఎంపికపై దృష్టి పెట్టింది. ఆదివారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర వరంగల్‌కు చేరుకోనుండగా.. సాయంత్రం నిర్వహించే రోడ్డు షో అనంతరం ఎంపీ అభ్యర్థి విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక అంశాలపై కేసీఆర్ గులాబీ నేతలతో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నాలుగు పర్యాయాలుగా వరంగల్, నల్గొండ, ఖమ్మం స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులే ఎమ్మెల్సీగా విజయం సాధిస్తూ వస్తున్నారు. అలా బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న పట్టభద్రుల స్థానాన్ని కాపాడుకోవాలని ఆ పార్టీ వ్యూహరచన చేస్తోంది. పోటీకి కూడా మాజీ చైర్మన్ సుందర్‌రాజన్, విలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డితో పలువురు ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్నారు. దీంతో కేసీఆర్ ఎమ్మెల్సీ టికెట్‌ను ఎవరికి ఖరారు చేస్తారనే ఉత్కంఠ శ్రేణుల్లో కనిపిస్తోంది.



'కంచుకోట'పై మరింత దృష్టి

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లోనూ విజయం సాధించే దిశగా బీఆర్ఎస్ ప్రత్యేక దృష్టి పెడుతోంది. 2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా అప్పటి నుంచి జరిగిన నాలుగు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2007లో తొలి ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కపిలివాయి దిలీప్‌కుమార్ విజయం సాధించగా.. అప్పుడు రెండేళ్ల

▸▸ మిగతా 7వ పేజీలో..

శనివారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 41.0°C
కనిష్ఠం : 25.5°C

మందకొడిగా వడ్ల సేకరణ

ఊపందుకోని ధాన్యం కొనుగోళ్లు

- లక్ష్యం 1.70 లక్షల మెట్రిక్ టన్నులు
- ఇప్పటి వరకు కొన్నది 1,335 మెట్రిక్ టన్నులే..
- జిల్లాలో కేవలం 15 కేంద్రాల్లోనే ఖరీదు షురూ
- ఇంకా 177 సెంటర్లలో ప్రారంభం కానీ తూకాలు



మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 27 : జిల్లాలో ధాన్యం సేకరణ మందకొడిగా సాగుతోంది. వడ్ల కొనుగోళ్ల ప్రారంభమై ఇప్పటికీ 25 రోజులు గడిచినా.. ఇంకా ఊపందుకోలేదు. అన్నదాతలు ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకునేందుకు మొగ్గు చూపుతోండడం, మరోవైపు సన్నవడ్లు పండించడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వాటిని విక్రయించడం లేదు. దీంతో ధాన్యం సేకరణ వేగంగా జరుగడం లేదు. రాష్ట్రప్రభుత్వం లక్ష్యం (టార్గెట్) 1.70 లక్షల మెట్రిక్ టన్నులు విధించగా, ఈ నెల 23 వరకు 1,335 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోళ్లు జరిగాయి. మహబూబాబాద్ జిల్లాలో 192 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. కేవలం 15 సెంటర్లలో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇంకా 177 కేంద్రాల్లో కొనుగోళ్ల ప్రారంభం కాలేదు.

జిల్లా వ్యాప్తంగా 192 కేంద్రాలు..

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 192 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 49 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 132, జీసీసీ ఆధ్వర్యంలో 7, మెప్మా ఆధ్వర్యంలో 2, డీహెచ్‌ఎస్‌వో ఆధ్వర్యంలో 2 కొనుగోలు సెంటర్లు షురూ అయ్యాయి. ధాన్యం కొనుగోళ్లు మాత్రం కేవలం 15 కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. ఐకేపీ ఆధ్వర్యంలో 7, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 8 కేంద్రాల్లో మాత్రమే ఖరీదులు చేపడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 183 మంది రైతులు 1,335 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నారు. ఆ వడ్ల విలువ రూ.2.93 కోట్లు. అందులో 69 మంది రైతుల ధాన్యం అమ్మకం వివరాలను 436 మెట్రిక్ టన్నులకు రూ.95.99 లక్షలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయగా, అందులో 23 మంది రైతులకు 154 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.33.96 లక్షలు చెల్లింపులు జరిగాయి. ఇంకా 'ఆన్‌లైన్' చేసిన వాటిలో 46 మంది రైతులకు 282 మెట్రిక్ టన్నుల ధాన్యానికి రూ.62.02 లక్షలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2203 ప్రభుత్వ మద్దతు ధర కాగా, కామన్‌రకం రూ.2183లుగా నిర్ణయించారు. ఏ గ్రేడ్ ధాన్యం 987 మెట్రిక్ టన్నులు, కామన్ రకం ధాన్యం 348 మెట్రిక్ టన్నులతో మొత్తం 1335 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేశారు.

సన్నాలకు డిమాండ్..

ఈ యాసంగి సీజన్ ప్రారంభం కాగానే సన్నరకం ధాన్యానికి డిమాండ్ ఏర్పడింది. వ్యవసాయ మార్కెట్‌లలో రూ.2600 రూ.3 వేలకు పైగా క్వింటా వడ్లకు ధర లు పలికాయి. దీంతో సన్నధాన్యం పండించిన రైతులు నేరుగా ప్రైవేట్, మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. జిల్లాలో కేసముద్రం, మహబూబాబాద్‌తో పాటు ఇతర మండలాల వ్యాపారులు, మిల్లర్లు నేరుగా పొలాల వద్దకే వెళ్లి వరి కోతలు కోయగానే పచ్చిగా ధాన్యం ఉండగానే కొం టున్నారు. ఆ పచ్చి ధాన్యాన్నే నేరుగా మిల్లర్లు మర ఆడిస్తున్నారు. ఈ ధాన్యం నిన్న, మొన్నటి వరకు క్వింటాకు రూ.2,350 ప్రైవేట్ వ్యాపారులు ఖరీదు చేశారు. ప్రస్తు తం రూ.2,100తోనే ఖరీదులు చేపడుతున్నట్లు తెలుస్తోం ది. జిల్లాలో 90 శాతం వరకు సన్నరకం ధాన్యం పండించారు. 10 శాతం మాత్రమే దొడ్డురకం ధాన్యం పండించారు. ఈ పదిశాతం దొడ్డురకం ధాన్యం పండించిన రైతులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుంటున్నారు. అయితే తొర్రూరు, దంతాలపల్లి, పెద్దవంగర మండలాల్లో కోతలు ముందుగా ప్రారంభం కావడం, మిగతా మండలాల్లో వరికోతలు ఇంకా ప్రారంభమే కాలేదు. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు ఊపందుకోలేదు. వరికోతలు పూర్తయితే కొంత కొనుగోళ్లలో వేగం పుంజుకునే అవకాశం అవకాశం ఉంది.



1,335 మెట్రిక్ టన్నుల ధాన్యం ఖరీదు చేశాం..

కృష్ణవేణి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్

జిల్లా వ్యాప్తంగా 192 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఇంకా వరికోతలు ఊపందుకోని దృష్ట్యా 15 కేంద్రాల్లో మాత్రమే ఖరీదులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 1335 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఖరీదు చేశాం. వరి కోతలు ఊపందుకుంటే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అత్యధికంగా క్రయవిక్రయాలు జరుగుతాయి.


మానుకోటలో మాట్లాడుతున్న రచిత్‌రాజ్

ఎలక్షన్స్ విధులను పారదర్శకంగా నిర్వహించాలి

ఎన్నికల సాధారణ పరిశీలకుడు రచిత్‌రాజ్

మహబూబాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు పారదర్శకంగా, ఖచ్చితత్వంతో విధులను నిర్వర్తించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు రచిత్‌రాజ్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల సహాయ రిటర్నింగ్ అధికారి (ఏఆర్‌వో) లతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తమ పరిధిలో పోలింగ్ కేంద్రాల వివరాలు, మౌళిక సదుపాయాలు, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు, హోమ్ ఓటింగ్, సువిధ, సీ-విజల్, బందోబస్తు, నగదు, మద్యం జప్తు తదిరాల వివరాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రచిత్‌రాజ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి లోటు పాట్లు, అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికలకు సంబంధించిన నివేదికలను పూర్తి పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

▸▸ పోలీస్ అబ్జర్వర్ చరణ్‌జిత్‌సింగ్

సీ-విజిల్‌లో ఏమైనా ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంటే, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అబ్జర్వర్ చరణ్‌జిత్ సింగ్ అన్నారు. చెక్ పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యయ పరిశీలకుడు ఉమాకాంత ద్రుపాటీ మాట్లాడుతూ ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ సిబ్బంది చెక్‌పోస్టుల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా పని చేయాలన్నారు. చెక్ పోస్టుల వద్ద వేసవి కాలం దృష్ట్యా సరిపడ నీరు, కుర్చీలు ఉండేలా చూసుకోవాలని, జప్తు చేసిన వాటి వివరాలు, నివేదికలను ఏప్పటికప్పుడు అందజేయాలని తెలిపారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అన్నిచర్యలు చేపట్టామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళికవసతులు కల్పించామని, ఓటింగ్ శాతం పెంచేందుకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. స్వీప్‌రన్, రంగోళి, ఓటరు ప్రచార రథం, 18 సంవత్సరాలు నిండిన యువత ఓటు హక్కు వినియోగించుకునేందుకుఅవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్, అసిసెంట్ రిటర్నింగ్ అధికారులు చిత్రామిశ్రా, ప్రతీక్‌జైన్, లెనిన్‌వత్సల్ టొప్పో, శ్రీజ, ఎం.డేవిడ్ పాల్గొన్నారు.


మేచరాజుపల్లిలో మాట్లాడుతున్న బలరాంనాయక్


పార్లమెంటరీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మురళీనాయక్

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

▸▸ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

నెల్లికుదురు, ఏప్రిల్27 : కేంద్రంలో 'హస్తం' పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి చెందుతుందని మహ బూబాబాద్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తెలిపారు. మండలం లోని మేచరాజుపల్లిలో బలరాంనాయక్‌తో పాటు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు వేతనం రూ.400 చెల్లిస్తామన్నారు. యువన్యాయం, రైతున్యాయం, శ్రామికన్యాయం, సామాజిక న్యాయం వంటి పథకాలను ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. మేచరాజుపల్లికి బస్సు సౌకర్యం, రోడ్డు సౌకర్యం, కల్పిస్తామన్నారు. ఎస్సారెస్పీ కాలువ మరుమతులు చేపట్టి సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవరెడ్డి, నాయిని సత్యపాల్ రెడ్డి, కాసం లక్ష్మారెడ్డి, వలబోజు వెంకటేశ్వర్లు, వెలిశాల దేవేందర్, కురపాటి వెంకటేశ్వర్లు, డెగెల వెంకన్న, బలరాం, జంగవంశీ కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, ఏప్రిల్ 27 : ఏఐసీసీ నేత రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ పిలుపునిచ్చారు. కేసముద్రం లక్ష్మీసాయిగార్డెన్‌లో శనివారం మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు అధ్యక్షతన పార్లమెంటరీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వమని అన్నారు. దేశంలో మత రాజకీయాలు చేస్తూ విద్వేషాలు సృష్టిస్తూ కక్షపూరితంగా వ్యవహరిస్తున్న బీజేపీని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఏనాయకుడైనా, కార్యకర్త అయినా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, ఎంపీటీసీ గుగులోత్ సునీత, నూనావత్ రాధ, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, గంట సంజీవరెడ్డి, బండారు దయాకర్, వెంకన్న, కదిరె సురేందర్, వోలం రమేష్, రావుల మురళి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఎమ్మెల్యే మురళీనాయక్ సమక్షంలో మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి సుందర్ వెంకన్న కాంగ్రెస్‌లో చేరారు.

రేపు మానుకోటకు జేపీ నడ్డా రాక

- ఎన్టీఆర్ స్టేడియంలో మధ్యాహ్నం 2 గంటలకు మానుకోట జనసభ
- తాళ్లపూసపల్లి రోడ్డు నుంచి స్టేడియం వరకు భారీ ర్యాలీ
- బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి




ఎన్టీఆర్ స్టేడియంలో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

మహబూబాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 29న మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్నట్లు ఆ పార్టీ అనుబంధ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ గెలుపును కాంక్షిస్తూ జనసభ జరుగుతుందని వివరించారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే బహిరంగ సభకు నడ్డా హాజరవుతున్నారని పేర్కోన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరుగనున్న జనసభ స్థలిని, ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి నేరుగా హెలిక్యాప్టర్ ద్వారా సోమవారం మధ్యాహ్నం 2గంటలకు నడ్డా మహబూబాబాద్‌కు చేరుకుంటారని చెప్పారు. అనంతరం ఈదులపూసపల్లి రోడ్డు నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు బీజేపీ పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీ ఉంటుందని వివరించారు. తర్వాత జరిగే జనసభలో నడ్డా ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ సభకు మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేట, ములుగు, ఇల్లందు నియోజకవర్గాల పరిధి నుంచి సుమారు 25 వేల మందిని తరలిస్తామన్నారు.

మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం..

గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రజలు మోదీని మూడోసారి

▸▸ మిగతా 8వ పేజీలో..

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 27 : హనుమకొండ బస్టాండ్‌లో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. ఆర్టీసీ డ్రైవర్ మునికుంట్ల దేవేందర్ శనివారం మధ్యాహ్నం సమయంలో బస్సు నడుపుకుంటూ బస్టాండ్‌లోకి వస్తుండగా ఎదురుగా బైకుపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు డ్రైవర్‌ను ఆపి గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలో మాటామాట పెరిగి డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. డ్రైవర్ ఫిర్యాదు మేరకు నర్సక్కపల్లికి చెందిన రంజిత్‌తో పాటు మరో వ్యక్తిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 27: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైనట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రెడ్డికాలనీకి చెందిన వద్దూరి లింగయ్య(85).. పెద్దకొడుకు ఇంటి నుంచి శనివారం యాదవనగర్‌లో ఉంటున్న చిన్న కొడుకు శ్రీనివాస్ ఇంటికి వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. ఎక్కడ వెతికినా సమాచారం దొరకలేదు. పెద్ద కుమారుడు రాజమౌళి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' డైరెక్టర్ కనకదుర్గకు ఘన నివాళి



మడికొండలోని యూనిట్ కార్యాలయంలో కనకదుర్గ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

మడికొండ, ఏప్రిల్ 27 : ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్ వేమూరి కనకదుర్గ మూడో వర్ధంతి సందర్భంగా హనుమకొండ జిల్లా మడికొండలోని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ యూనిట్ కార్యాలయంలోని ఉద్యోగులు, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ అభ్యున్నతికి కనకదుర్గ చేసిన కృషిని వారు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, ఎడిషన్ ఇన్‌చార్జి కె.రాజేశ్, బ్యూరో ఇన్‌చార్జి తడక రాజనారాయణ, ఏడీవీటీ ఇన్‌చార్జి విజేందర్‌రెడ్డి, సిస్టమ్స్ ఇన్‌చార్జి చక్రి, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

30న రేగొండకు సీఎం రేవంత్

- భారీ బహిరంగ సభకు హాజరు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

భూపాలపల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30వ తేదీన భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపే లక్ష్యంగా పరకాల, భూపాలపల్లి రెండు నియోజకవర్గాల స్థాయిలో ఈ సభను ఏర్పాటు చేశామన్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారన్నారు. ఈ సభను విజయవంతం చేయడం కోసం నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జిల్లా, మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే హామీలను అమలులోకి తీసుకొచ్చామన్నారు. పార్లమెంటు ఎన్నికల అనంతరం నియోజకవర్గంలోని ఇండ్లులేని నిరుపేద కుటుంబాలకు భూములు కొనిచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రజలను వంచించాయని సత్యనారాయణరావు అన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికిన బీజేపీ ఆ ఊసే మరిచిందన్నారు. రైతులకు నష్టం కలిగించే నల్ల చట్టాలను తీసుకురావాలని కుట్ర పన్నిందన్నారు. ఈ క్రమంలో వందలాది మంది రైతుల మృతికి కారకులయ్యారన్నారు. శవాలపై పేలాలు ఏరుకునే విధంగా జీఎస్టీ పన్నులు వసూలు చేస్తుందన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు దండుకునే కుట్ర చేస్తుందన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పార్టీ ఇంటికో ఉద్యోగం ఇస్తా అని, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ ఉచిత విద్య ఇలా అనేక హామీలిచ్చి వాటిని తుంగలో తొక్కిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ కౌన్సిల్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు చల్లూరి మధు, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, నాయకులు రాం నర్సింహారెడ్డి, దేవన్, కొమురయ్య, రామ్‌చంద్రయ్య, శ్రీనివాస్, తోట రంజిత్, సంతోష్, రాజిరెడ్డి, రమేష్, భార్గవ్, శ్రీరాములు పాల్గొన్నారు.

'గులాబీ'లో ఎమ్మెల్సీ టికెట్ టెన్షన్..

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్సీ కాలపరిమితి ఉండటంతో 2009లో మరోసారి ఎన్నికలు జరిగాయి. రెండోసారి కూడా కపిలవాయి దిలీప్‌కుమార్ బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించారు. 2015, 2021లో జరిగిన ఎన్నికల్లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థిగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. దీంతో శాసన మండలిలో వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానం 17ఏళ్లుగా బీఆర్ఎస్ ఆధీనంలోనే ఉంది. పల్లా రాజేశ్వర్‌రెడ్డి వరంగల్ జిల్లా వాసి అయినప్పటికీ ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో ఉన్న వామపక్షవాదులు మద్దతుగా నిలవడంతో పల్లా గెలుపు సులువయిందనే చర్చ జరుగుతోంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి చెందటం.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పాటు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీలోకి వలసలు పెరగడంతో గులాబీ పార్టీ కాస్త బలహీన పడిందనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు పట్టభద్రుల స్థానం కూడా బీఆర్ఎస్‌కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి అండగా నిలిచిన వరంగల్‌లో ఎంపీ సీటుతో పాటు ఎమ్మెల్సీ స్థానాన్ని కాపాడుకోవటం ఆ పార్టీకి సవాల్‌గా మారింది.

తెరపైకి ఉద్యమ నేతలు..

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల స్థానం నుంచి పోటీకి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేతలు, సీనియర్ నేతలు క్యూ కడుతున్నారు. అయితే ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నను బరిలో దించింది. 2021 మార్చి 14న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్లన్న స్వతంత్రుడిగా బరిలో దిగి ద్వితీయ స్థానంలో నిలిచిన ఆయన బీసీ సామాజిక వర్గం నేత కావటంతో పాటు కాంగ్రెస్ టికెట్ దక్కటంతో గులాబీ పార్టీ గట్టి అభ్యర్థి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. అయితే అధికార పార్టీలో ఉన్న తీన్మార్ మల్లన్నను ఢీ కొట్టే నేత ఎవరనే చర్చ బీఆర్ఎస్‌లోజరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం వరంగల్‌లో రోడ్ నిర్వహించనున్నారు. ఈ రోడ్ షో అనంతరం అనంతరం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు కేసీఆర్‌తో భేటీ కానున్నట్లు సమాచారం. వరంగల్ ఎంపీ స్థానంలో ఓప్రవేటు సర్వేలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా రిపోర్టు వచ్చినట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ సర్వే రిపోర్టు గురించి వివరించడంతో పాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై నేతలు కేసీఆర్‌తో చర్చించే అవకాశమున్నట్లు తెలిసింది. అయితే ఇప్పటికే ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు పలువురు నేతలు ఉత్సాహంతో ఉన్నారు. ప్రధానంగా వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి ఎమ్మెల్సీ టికెట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వాసుదేవరెడ్డికి.. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి మద్దతు ఇస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

అయితే గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరిన రాకేష్‌రెడ్డి కూడా ఉప ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారని, ఆయనకు పార్టీలో చేరినప్పుడే అనేక హామీలు ఇచ్చారని, ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం లేకపోవటంతో రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఉపఎన్నికల బరిలో నిలపాలని పార్టీలోని కొందరు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏబీవీపీ నుంచి వచ్చిన రాకేష్‌రెడ్డి బరిలో ఉంటే విద్యార్థి సంఘం నుంచి కూడా కొంత మద్దతు లభిస్తుందని బీఆర్ఎస్‌లోని ఓ వర్గం భావిస్తోంది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాహాటంగానే రాకేష్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నారనే చర్చ కూడా జరుగుతోంది. అలాగే పలు విద్యా సంస్థల అధిపతిగా ఉన్న మాజీ కుడా చైర్మన్ సుందర్‌రాజు కూడా ఎమ్మెల్సీ టికెట్‌కోసం ప్రయత్నిస్తున్నారు. 2వేల మందికిపైగా ఉన్న విద్యాసంస్థల అధ్యాపకులు సుందర్‌రాజుకు మద్దతు ఇస్తారని బీఆర్ఎస్‌లోని ఓ వర్గం అంచనా వేస్తోంది. సుందర్‌రాజు ఉద్యమకారుడిగా పనిచేసిన క్రమంలో మూడు ఉమ్మడి జిల్లాల్లోని వారితో సత్సంబధాలు ఉన్నాయని చెబుతున్నారు. పలువురు మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు సుందర్‌రాజుకు మద్దతుగా ఉన్నారు. అయితే అధిష్ఠానం వీరి పేర్లను పరిశీలిస్తునే కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు గట్టి పోటీ ఇవ్వగల నేతలు ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో యోచిస్తున్నట్టు సమాచారం. నల్గొండ జిల్లాకు చెందిన తీన్మార్ మల్లన్నకు పోటీగా వరంగల్ నేతనే బరిలో దించుతారనే ప్రచారం జరుగుతుండగా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బరిలో దించితే ఉప ఎన్నికల్లో గట్టి పోటీ ఇవ్వవచ్చుననే చర్చ పార్టీలో జరుగుతుంది. అయితే పోటీకి ఎర్రబెల్లి సుముఖత వ్యక్తం చేస్తారా? ఆయన కాదంటే మాజీ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ పేరును కూడా పరిశీలించే అవకాశం ఉన్నట్లు సమాచారం. వీరితో పాటు ఇద్దరు ముగ్గురు సీనియర్ నేతల పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. అయితే కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారో.. ఎవరిని అభ్యర్థిగా బరిలో దించుతారోననే ఉత్కంఠ గులాబీ శ్రేణుల్లో నెలకొంది.

బీఆర్ఎస్‌కు సవాల్‌గా ఉప ఎన్నిక

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగే ఉప ఎన్నిక బీఆర్ఎస్‌కు సవాల్‌గా మారుతోంది. గత నాలుగు పర్యాయాలు విజయం సాధించిన ఎమ్మెల్సీ స్థానాన్ని ప్రస్తుతం కాపాడుకోవటం అంతా సులువు కాదనే చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్, నల్గొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఉన్న అసెంబ్లీ స్థానాల్లో మెజార్టీ సీట్లను కాంగ్రెస్ గెలుచుకుంది. అంతేకాకుండా ఖమ్మం నుంచి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టి విక్రమార్క, నల్గొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖ, సీతక్క మంత్రులుగా ఉన్నారు. దీంతోపాటు గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గట్టిపోటీ ఇచ్చిన తీన్మార్ మల్లన్న ఈ సారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగుతున్నారు. ఈ నేపథ్యంలో గత నాలుగు సార్లు గెలిచిన స్థానంలో పట్టు నిలుపుకోవటం బీఆర్ఎస్‌కు సవాల్‌గానే మారిందన్న చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల్లో ఓటర్లు కూడా పట్టభద్రులు కావటంతో బీఆర్ఎస్‌కు మరింత ప్రతిష్ఠాత్మకంగా మారింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికలను ఎదుర్కోవటమే ఇబ్బందిగా మారగా, ఎమ్మెల్సీ ఉపఎన్నిక మరింతసవాల్‌గా మారిందనేచర్చ జరుగుతోంది.

గత ఎన్నికల్లో అభ్యర్థులకు పోలైన ఓట్లు

అభ్యర్థి పేరు	పార్టీ	పోలైన ఓట్లు
పల్లా రాజేశ్వర్‌రెడ్డి	బీఆర్ఎస్	1,11,190
తీన్మార్ మల్లన్న	స్వతంత్ర	83,629
కోదండరామ్	టీజేఎస్	70,472
జి.ప్రేమేందర్‌రెడి	బీజేపీ	39,268
రాములునాయక్	కాంగ్రెస్	27,713
జయసారథిరెడ్డి	సీపీఐ	8,732

నోటా అంటే?



శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ సారి వినిపించే మాటా 'నోటా'. అంటే పైన ఏదీ లేదు అని అర్థం. పోటీ చేసే అభ్యర్థులందరికీ తిరస్కరణ ఓటును అధికారికంగా నమోదు చేయడానికి ఓటరును అనుమతించే ఎంపిక. ఓటరు నోటా మీటను నొక్కాలని ఎంచుకుంటే, ఆ ఓటరు ఏ పార్టీకి ఓటు వేయలేదని సూచిస్తుంది. 2013 సెప్టెంబరు 27న ఎన్నికల్లో 'పైన ఏదీ లేని' ఓటును నమోదు చేసుకునే హక్కును వర్తింపజేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. అదేసమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలలో బటన్‌ను ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఓటర్లు నోటాను వినియోగించుకునేందుకు వీలుగా 'నన్ ఆఫ్ ది ఏబొ' ఎంపిక కోసం ఈసీఐ ప్రత్యేక గుర్తును ప్రవేశపెట్టింది. ఈ గుర్తు అన్ని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లలో (ఈవీఎంలు) చివరి ప్యానెల్‌లో కనిపిస్తుంది. నోటా ఎంపిక ప్రధాన లక్ష్యం ఏమిటంటే అభ్యర్థులెవరికి ఓటు వేయకూడదనుకునే ఓటర్లు తమ నిర్ణయం గోప్యతను ఎవరూ ఉల్లంఘించకుండా తిరస్కరించే హక్కును వినియోగించుకునేలా చేయడం. పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటు వేయడానికి అర్హులు కాదని భావించినట్లయితే ఓటరు తప్పనిసరిగా తిరస్కరణ ఓటును నమోదు చేయడానికి అర్హత కలిగి ఉండాలి. పౌరులందరికీ ఇచ్చిన ఓటు హక్కు తప్పనిసరిగా అసమ్మతి ఓటును అనుమతించాలి.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

మూడు రకాల ఎన్నికలు


- సాధారణ, ఉప, మధ్యంతర ఎన్నికలు

సాధారణ ఎన్నికలు: ఒక ప్రజాస్వామ్య దేశంలో ఐదేళ్ల తర్వాత వచ్చే ఎన్నికలను సాధారణ, సార్వత్రిక ఎన్నికలు అంటారు.

ఉప ఎన్నికలు: ఐదేళ్ల మధ్య కాలంలో లోక్‌సభలోగానీ, విధానసభలోగానీ సభ్యుడు రాజీనామా చేయడం, లేదా చనిపోవడం తదితర కారణాల వల్ల ఏ నియోజకవర్గమైన ఖాళీ అయితే అక్కడ నిర్వహించే ఎన్నికను ఉప ఎన్నిక అంటారు.

మధ్యంతర ఎన్నికలు: ఐదేళ్ల కాలపరిమితి ముగియక ముందే మధ్యలో అసెంబ్లీగానీ, లోక్‌సభలోగానీ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మెజారిటీ కోల్పోతే నిర్వహించే ఎన్నికలను మధ్యంతర ఎన్నికలంటారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)



కొత్తగా ఓటరు గైడ్

- పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రయత్నం
- ఓటరు గైడ్ పంపిణీకి సిద్ధం

మట్టెవాడ(వరంగల్), ఏప్రిల్ 27: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ అధికారులు వినూత్న ఆలోచనలు ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. మహిళా సంఘాల సభ్యులతో, మెప్మా ఆర్పీలతో ఓటరు చైతన్య సదస్సులు, విద్యార్థులు, యువతి, యువకులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం, ఓటు హక్కు వినియోగించడంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు.

ఓటర్లందరు పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు వేసే విధంగా వివిధ రూపాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఓటర్ల సౌకర్యార్థం పలు యాప్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఓటరు గైడ్ ను తీసుకొచ్చారు. ఎన్నికల కమిషన్ తాజాగా ఓటరు గైడ్ పేరిట బుక్‌లెట్ విడుదల చేసింది. బూత్‌లెవల్ ఆఫీసర్ ద్వారా ప్రతీ ఇంటికి పంపిణీ చేయాలని నిర్ణయించారు. రద్దీ ప్రాంతాల్లో ఓటరు గైడ్‌ను బుక్‌లెట్లను పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. ఈ గైడ్‌లో ఓటరు నమోదు నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వరకు సమగ్ర వివరాలను ఈ గైడ్‌లో పొందుపర్చారు.

ఓటరుకు ఉపయుక్తం ఓటరు గైడ్

ఓటు నమోదు నుంచి నామినేషన్ వరకు అన్ని వివరాలు ఈ ఓటరు గైడ్‌లో ఉండాలి. నూతన సాంకేతిక సహాయంతో ఎన్నికల కమిషన్ సేవలను ఓటర్లకు చేరవేస్తుంది. ఓటు నమోదు మొదలుకొని నామినేషన్ల వరకు ప్రతీది ఓటర్లు తమ స్మార్ట్ ఫోన్ ద్వారా చూసుకోవచ్చు. దీనికోసం పలు యాప్‌లను తీసుకొచ్చారు. వీటి గురించి ఓటరు గైడ్‌లో వివరించారు. వివిధ యాప్‌లు వాటి పనితీరు, ఓటరు ప్రతిజ్ఞ తదితర అంశాలను గైడ్ బుక్‌లో పొందుపర్చారు. అంతేగాకుండా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, సిబ్బంది, ఓటు హక్కు వినియోగం, ఈవీఎం యంత్రాల పనితీరు, వీవీ ప్యాట్‌లలో ఓటు నమోదు వివరాలు ఇలా ప్రతీ అంశంతో కూడిన ఓటింగ్ ప్రక్రియను సులువుగా తెలుసుకునేందుకు గైడ్‌ను ముద్రించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి. సీ-విజిల్ యాప్ వివరాలు, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం గురించి, ఓటరు హెల్ప్‌లైన్ యాప్, నో యువర్ క్యాండెట్ యాప్, ఓటు వేసే విధానం, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ స్టేషన్ వివరాలు ఈ సందేశాత్మకమైన ఓటరు గైడ్ బుక్‌లెట్ ద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఉపయోగపడుతుందని అధికారులు అంటున్నారు. బీఎల్‌వోల ద్వారా ఈ బుక్‌లెట్‌లను మొదటిసారిగా ఓటుహక్కు వినియోగించుకునే యువతి, యువకులకు అందజేయాలని నిర్ణయించారు.

చైతన్య వంతమైన ప్రజాస్వామ్యం కోసం ఓటరు అప్రమత్తత , పరిశీలన, నిజాయితీ గల ఓటరు అనే నినాదాలతో ఈ బుక్‌లెట్‌ను రూపొందించారు. సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ (స్వీప్) బృందాలు ఫ్లెక్సీలు బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్నారు.

నేడు వరంగల్‌కు కేసీఆర్

- సాయంత్రం నగరంలో రోడ్‌షో
- సభకు హాజరుకానున్న 90వేల మంది



రాంనగర్, ఏప్రిల్ 27 : భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం వరంగల్ నగరానికి వస్తున్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి సుధీర్‌కుమార్ తరపున హనుమకొండలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు నగరానికి చేరుకునే కేసీఆర్.. నేరుగా కెప్టెన్ లక్ష్మీకాంతరావు నివాసానికి చేరుకుని కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. అనంతరం జిల్లా నేతలతో కలిసి బస్సులో అదాలత్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, పెట్రోల్ పంపు జంక్షన్ మీదుగా హనుమకొండ చౌరస్తాకు చేరుకుంటారు. చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈ సభకు వరంగల్ లోక్‌సభ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి దాదాపు 90వేల మందిని తరలించేందుకు నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఈ రోడ్ షోకు సంబంధించి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. కేసీఆర్ రోడ్ షోకు సంబంధించి హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యవేక్షణ చేస్తున్నారు. సభను విజయవంతం చేసి బీఆర్ఎస్ సత్తా చాటేందుకు నేతలు కసరత్తు చేస్తున్నారు. కాగా, రోడ్ షో అనంతరం రాత్రి కెప్టెన్ నివాసంలో బస చేయనున్నారు. సోమవారం మధ్యాహ్నం కేసీఆర్ ఖమ్మం జిల్లాకు వెళతారు.

నామినేషన్ల ఉపసంహరణకు

రేపటితో గడువు పూర్తి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 : పార్లమెంట్ నియోజకవర్గ నామినేషన్ల ప్రక్రియలో ఉపసంహరణల అంకానికి సోమవారంతో గడువు ముగియనుంది. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తవగా.. వరంగల్ నియోజకవర్గంలో పది, మహబూబాబాద్‌లో ఐదుగురి నామినేషన్ల తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియకు అవకాశం ఉండగా.. శనివారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. ఆదివారం సెలవు కాగా సోమవారం ఈ ఉపసంహరణ ప్రక్రియకు గడువు పూర్తవనుంది. సోమవారం ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రెండు నియోజకవర్గాల్లోనూ బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాపై స్పష్టత రానుంది. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ జరగ్గా.. వరంగల్ లోక్‌సభ స్థానానికి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కలిపి మొత్తం 58 మంది నామినేషన్లు వేయగా పలు కారణాలతో పది మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 48 మంది బరిలో నిలిచారు. ఇక మహబూబాబాద్ పరిధిలో మొత్తం 30 మంది నామినేషన్లు వేయగా ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. దీంతో 25 మంది అభ్యర్థులు మిగిలారు. ఇక 29న ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత వీరిలో ఎవరుబరిలో నిలుస్తారో తేలనుంది.

బీఆర్ఎస్‌ను వీడేదిలేదు..

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

వరంగల్ సిటీ, ఏప్రిల్ 27 : తాను బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, తాను బీఆర్ఎస్‌ను వీడేది లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తెలిపారు. శనివారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి తన రాజకీయ గురువని, ఆయన తనను సొంత కొడుకులా చూసుకున్నాడని గుర్తుచేశారు. ఆయన కుమారుడికి కాంగ్రెస్ పార్టీ నుంచి ఖమ్మం ఎంపీ టికెట్ కేటాయించిన నేపథ్యంలో ఖమ్మం వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశానే తప్ప.. తమ మధ్య ఎలాంటి రాజకీయ అంశాలు చర్చకు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాజకీయంగా ఎదగడంలో సురేందర్‌రెడ్డి పాత్ర కీలకమన్నారు. కష్టనష్టాల్లో ఉన్నప్పుడు ఆయన తనకు వెన్నుదన్నుగా ఉన్నాడని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తనకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మంచి సంబంధాలున్నాయని, అందులో తప్పేముందన్నారు. మర్యాదపూర్వకంగా కలిసినంత మాత్రాన పార్టీ వీడుతున్నట్లు ప్రచారం చేయడం సరైంది కాదని చెప్పారు.

మళ్లీ మోదీ ప్రధాని కావడం ఖాయం

• బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్

కేసముద్రం, ఏప్రిల్ 27 : దేశానికి మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ జోస్యం చెప్పారు. కేసముద్రం విలేజిలో ఆ పార్టీ బూత్‌స్థాయి సమావేశం శనివారం మండల పార్టీ అధ్యక్షుడు పొదిల నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ హయాంలోనే దేశానికి ప్రపంచంలోనే గుర్తింపు వచ్చిందని తెలిపారు. బీజేపీ గెలుపు ఖాయం అయిపోయిందని 400 సీట్లకుపైగా గెలవబోతోందని, ఉద్యమకారులంతా తనకే మద్దతు పలుకుతున్నారని అన్నారు. బూత్‌కు ఐదుగురు చొప్పున కమిటీగా ఏర్పడి ఇంటింటికి కేంద్ర పథకాలను ప్రచారం చేయాలని, 10 రోజులు రేంబవళ్లు పనిచేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాలన్నీ సమగ్రంగా అభివృద్ధి చెందుతాయి. సమావేశంలో జిల్లా మాజీ



కేసముద్రం విలేజిలో మాట్లాతున్న సీతారాంనాయక్

అధ్యక్షుడు రాంచందర్‌రావు, ప్రధాన కార్యదర్శి నాయిని ధర్మారెడ్డి, వల్లభు వెంకటేశ్వర్లు, మార్కెట్ మాజీ చైర్మన్ శశివర్ధన్‌రెడ్డి, గాంతి వెంకట్‌రెడ్డి, రడం వెంకన్న, తుంపిళ్ల శ్రీనివాస్, వేముల కొమ్మాల్‌రెడ్డి, బోనగిరి ఉపేందర్, ఖాసీం పాల్గొన్నారు.

జాతీయ పార్టీతోనే దేశాభివృద్ధి

మహబూబాబాద్ రూరల్ : జాతీయ పార్టీ బీజేపీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లో సీతారాంనాయక్ స్వగృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలు దేశ శ్రేయస్సు కొరకు, దేశరక్షణ, ప్రతిష్ట కోసం జరిగే ఎన్నికలన్నారు. మోదీ పదేళ్ల పాలనలో అవినీతి రహిత పాలన కొనసాగించారని చెప్పారు. దేశ ప్రజలందరూ మళ్లీ మూడోసారి మోదీని ప్రధాని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సారి మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవపెద్ది శశివర్దన్‌రెడ్డి, పార్లమెంట్ ప్రబారి నూకల వెంకటనారాయణ రెడ్డి, వద్దిరాజు రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి

• డీఎంఅండ్‌హెచ్‌వో బి.కళావతిబాయి

నెహ్రూసెంటర్, ఏప్రిల్27 : ప్రజలు సికిల్‌సెల్, ఎనిమియా వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి బి.కళావతిబాయి అన్నారు. జిల్లా ఐడీఓసీలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనిమియా వ్యాధితో కాళ్ల నొప్పితో కూడిన వాపు, రక్తహీనత, కీళ్లకు రక్తప్రసరణ అడ్డుకోవడం ద్వారా నొప్పి వస్తుందన్నారు. ఎముకల్లో కొన్ని గంటలపాటు దీర్ఘకాలిక నొప్పి, కీళ్ల నష్టం, అల్సర్ సంభవిస్తాయని, ఇది జన్యు సంబంధిత దీర్ఘకాలిక వ్యాధి అని, కుటుంబసభ్యుల్లోని ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాపిస్తుందని, ఈ వ్యాధికి పూర్తి చికిత్సలేదని పేర్కొన్నారు. సికిల్‌సెల్ క్యారియర్‌లను గుర్తించి వారి మధ్య వివాహాలను నిరోధించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చన్నారు. ఈ వ్యాధిని త్వరితగతిన నివారించాలని, లేనిపక్షంలో దుష్పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సికిల్‌సెల్ ఎనిమియా



సమావేశంలో మాట్లాడుతున్న కళావతిబాయి

స్క్రీనింగ్ క్యాంపులను జీవో నుంచి 40 సంవత్సరాల్లోపు ప్రజలందరికి త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు. దీని కోసం ప్రజలు తమ ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకుని మొబైల్ నెంబర్ లింక్ చేసుకోవాలన్నారు. స్క్రీనింగ్ త్వరితగతిన పూర్తవుతుందని, దీంతో ఎంతమంది ప్రజలు ఈ వ్యాధితో బాధపడుతున్నారో తెలుసుకునేందుకు అనువుగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు అంబరీష, నాగేశ్వర్‌రావు, శ్రావణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, గీత, రుక్మోద్దీన్, రాజ్‌కుమార్, ఉమాకర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం బీజేపీని ఓడించాలి



జిల్లా సదస్సులో మాట్లాడుతున్నరాష్ట్ర కోశాధికారి రాములు

• సీఐటీయూ నాయకుడు రాములు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 : కార్మిక హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో 'పార్లమెంట్ ఎన్నికలు- కార్మికవర్గంకర్తవ్యం' అనే అంశంపై శనివారం ఆకుల రాజు అధ్యక్షతన జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన రాములు మాట్లాడుతూ పదేళ్ల బీజేపీ పాలన బడా సంపన్నుల సేవలో సాగిందని విమర్శించారు. రాజ్యాంగాన్ని మారుస్తామని ఏకంగా కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు మాట్లాడుతుంటే దేశంలో ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక త్యాగాలతో కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి వారి హక్కులను కాలరాసిందని మండి పడ్డారు. మే ఒకటిన ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి, నాగన్న, స్నేహ బిందు, సరోజ, శ్రీశైలం, మల్లయ్య, శ్రీనివాస్, జయరాజు, సంపూర్ణ, పుష్ప, మోహన్, వీరన్న, అజాద్, సంధ్య అండాలు, సలీమా, స్వరూప పాల్గొన్నారు.

జిల్లాలో రూ.3.50 లక్షల నగదు పట్టివేత

• వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ నగదు

మహబూబాబాద్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. సరిహద్దుల్లోఏర్పాటు చేసిన చెక్‌పోస్టులతో పాటు ప్రధాన రహదారుల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం వాహనాల తనిఖీల్లో నాలుగుచోట్ల ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.3, 50,400 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మహబూబాబాద్ జిల్లాలోని ఏజెన్సీ కొత్తగూడ మండలకేంద్రంలో గూడూరు సీఐ బాబురావు, కొత్తగూడ ఎస్సై దిలీప్, గంగారం ఎస్సై రవికుమార్ నేతృత్వంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఎంచగూడెంకు చెందిన రొట్లకంటి అనిల్‌రెడ్డి ఎలాంటి ఆధారపత్రాలు లేకుండా రూ.1,37,700 తీసుకువెళ్తుండగా, అతడి వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు.



ముల్కలపల్లిలో నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

పత్రాలు సరిగాలేని, నెంబర్ ప్లేట్‌లేని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి శివార్లలోని నర్సింహులపేట క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై ఝాన్సీ నేతృత్వంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. చిన్నగూడూరుకు చెందిన గాడిపెల్లి సందీప్ ఎటువంటి రసీదులు, పత్రాలు లేని రూ.70 వేల నగదును సీజ్‌చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రవీందర్‌కు నగదును అప్పగించారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద జాతీయ రహదారి 365/ఏ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద సరైన పత్రాలు లేని రూ.62, 700 నగదును పట్టుకున్నట్లు డోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా ఖమ్మం జిల్లా పుట్టకోటకు చెందిన ఓర్సు కనకయ్య అనేవ్యక్తి వద్ద నుంచి సరైన పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గూడూరు మండలం భూపతిపేట చెక్‌పోస్టు వద్ద ఓ వ్యక్తి నుంచి ఎలాంటి పత్రాలు లేని రూ.80 వేలు నగదును పట్టుకున్నట్లు సీఐ బాబురావు, ఎస్సై నగేష్ తెలిపారు. చెన్నారావుపేటకు చెందిన పి.వంశీ ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న ఈ నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. జిల్లాలో నాలుగు చోట్ల వాహనాల తనిఖీల్లో మొత్తంగా రూ.3,50,400 నగదును పోలీసులు పట్టుకున్నారు.

బలరాం గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

గూడూరు, ఏప్రిల్ 27 : మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, పార్టీశ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు అన్నారు. గూడూరు మండలం సీతనాగారం, భూపతిపేట, వెంగంపేట గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బలరాంనాయక్ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు శక్తివంచన లేకుండ కృషి చేయాలన్నారు. కేంద్రంలో సైతం రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం



వెంగంపేటలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, బోయినపల్లి సతీష్‌రావు, వాంకుడోతు కొమ్మాలు, బొల్లికొండ మధు, రమణారెడ్డి, నరేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, బొడ్డు వెంకటయ్య, సోమ్ల, పాల్తీయా సురేందర్ పాల్గొన్నారు.

'జనరల్ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలి'

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్27 : ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. దేశవ్యాప్త ఉద్యమంలో భాగంగా మహబూబాబాద్ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో శనివారం ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రతీ రైలులో సాధారణ బోగీల సంఖ్యను ఐదుకు పెంచాలని ప్రధానిమోదీకి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నారని, ఇందులో జనరల్ బోగీల్లో వెళ్లే ప్రయాణికుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా బోగీల సంఖ్యను పెంచాలని ప్రధానికి పోస్టు కార్డును రాయాలని చెప్పారు. కాగా 400 వందల మంది విద్యార్థులు ఉత్తరాలు రాసి పోస్టు డబ్బాలో వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌దాసు రాజు, అధ్యాపకులు మమత, రామరత్నమాల, వేణుగోపాల్, రాజేందర్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టు కార్డు ఉద్యమంలో మాట్లాడుతున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

రేపు మానుకోటకు జేపీ నడ్డా రాక

(5వ పేజీ తరువాయి)

ప్రధానిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని కొండపల్లి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. 500 ఏళ్ల రామమందిర సమస్యను పరిష్కరించి, అక్కడే రామమందిరం గుడి నిర్మాణం చేసి ఇటీవల ప్రారంభించారని పేర్కొన్నారు. ఆర్టికల్ 370ని సైతం మోదీ పరిష్కరించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను విస్మరించిందని, ఏ ఒక్క దానిని కూడా నేటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు అడిగే నైతికహక్కు లేదన్నారు. బీజేపీ పార్టీకి 400 సీట్లు వస్తాయని, అందులో కూడా మహబూబాబాద్ సీటు ఒకటని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్, జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాప సీతయ్య మోసంగి మురళి, సింగారపు సతీష్, మొసంగి మురళి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, శశివర్ధన్‌రెడ్డి, నూకల వెంకటనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, వద్దిరాజు రాంచందర్‌రావు, వల్లభు వెంకటేశ్వర్లు, ఫైండ్ల శ్రీనివాస్, పల్లె సందీప్, వెంకటాచారి, ఇందుభారతి పాల్గొన్నారు.

14 కేజీల ఎండుగంజాయి స్వాధీనం

• ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 27 : జిల్లా కేంద్రంలోని తొర్రూరు బస్టాండ్‌లో ఓ మహిళ వద్ద నుంచి 14.450 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన మిట్టురౌత్ శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి ఎండుగంజాయిని తీసుకుని మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో రైల్వే పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారన్న సమాచారంతో శనివారం ఉదయం తొర్రూరు బస్టాండ్ చేరుకుంది. అక్కడ నుంచి తొర్రూరు బస్టాండ్‌కు చేరుకుని తొర్రూరు మీదుగా వరంగల్‌కు వెళ్లేందుకు బస్సు కోసం వేచిచూస్తోంది. అటుగా వెళ్లిన పోలీసులకు అనుమానస్పదంగా కన్పించిన సదరు మహిళ వద్ద రెండు బ్యాగులను తనిఖీ చేయగా 14.450 గ్రాముల ఎండు గంజాయి ఎండుగంజాయి లభ్యమైనట్లు చెప్పారు. సుమారు దాని విలువ రూ.70వేల వరకు ఉంటుందని చెప్పారు. ఎండుగంజాయిని స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

14 ఏళ్ల పోరాటంతోనే ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం

• మానుకోట ఎంపీ మాలోతు కవిత

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 : ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా మాజీ సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌ను స్థాపించి 14 ఏళ్ల పోరాటాలు చేసి స్వరాష్ట్రాన్ని సాధించారని మానుకోట ఎంపీ మాలోతు కవిత అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. మాలోతు కవిత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మునిసిపల్ చైర్మన్ పాల్వా యి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, బానోత్ రవి కుమార్, తేళ్ల శ్రీనివాస్, గద్దె రవి, ఎమ్డీ.ఫరీద్, గోగుల రాజు, ముత్యం వెంకన్న, షేక్. మహబూబ్ పాష, ఎడ్ల వేణు, సలీం, జెరిపోతుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

• గార్ల : మండలకేంద్రంలోబీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఆపార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. తొలుత స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్ పార్టీ జెండాను ఎగర వేశారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పసుగంటి రాధాకృష్ణ, సంగిశెట్టి ప్రభాకర్, గాజుల గణేష్, వెంకటేశ్వర్లు, పాష, రవీందర్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరించివేస్తున్న బీజేపీ

కేసముద్రం, ఏప్రిల్ 27 : ఎన్నో పోరాటాలతో కార్మికులు సాధించుకున్న హక్కులను హరించి వేస్తున్న బీజేపీని ఈ పార్లమెంటు ఎన్నికల్లో ఓడించాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ పిలుపునిచ్చారు. కేసముద్రంలో శనివారం ఆయన మాట్లాడుతూ మేడే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 27 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల స మస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రగతిశీల అఖిల భారత వ్యవసా య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుఉమగాని సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో శనివారం కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా సత్యం మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం ఉపాధి కూలీలకు రకరకాల కొర్రిలు పెడుతూ ఆ పథకాన్ని రద్దుచేసే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.700 చొప్పున చెల్లిస్తూ ప్రతీకార్డుపై 300 రోజులు పనికల్పించాలని డిమాండ్ చేశారు. ఫైండ్ల యాకయ్య, అలకుంట్ల కొమురయ్య సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 27 : తొర్రూరు మండలం వెలికట్టె గ్రామంలో ప్రమాదవశాత్తు గడ్డివాముదగ్ధమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం... వెల్లికట్టె గ్రామానికి చెందిన పల్లె పాపయ్య తనకు ఉన్న 2ఎకరాల వ్యవసాయ భూమిలో లభించిన సుమారు 150 మోపుల గడ్డికట్టలు ఇంటి వద్ద వాముగా పేర్చాడు. శనివారం మధ్యాహ్నం వేళ్లలో ఒక్కసారిగా గడ్డివాములో నుంచి మంటలు వచ్చి దగ్ధమైంది. కాగా, ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చినప్పటికీ రాకపోవడంతో స్థానికంగా ఉన్న జీపీ ట్యాంకర్ డ్రైవర్ బందు రాముకు సమాచారం అందించి మంటలు ఆర్పేశారు. ఫైరింజన్ అందుబాటులో లేకపోవడంతో ప్రమాదాలు జరిగినపుడు ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీపీ సిబ్బంది, పంచాయతీ అధికారులు స్పందించి మంటలు ఆర్పడంతో పలువురు రైతులు అభినందిస్తున్నారు.

నేడు ఎంజేపీ బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ ప్రవేశ పరీక్ష

• జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 27 : మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలు, డిగ్రీ కళాశాల ప్రవేశ పరీక్షను ఆదివారం (నేడు) నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్ జిల్లా కన్వీనర్ జి.అనిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పా టు చేశామని వెల్లడించారు. ఇందులో ఇంటర్ ప్రవేశ పరీక్ష 962 మంది, డిగ్రీ 476 మంది ప్రవేశ పరీక్ష రాయనున్నారని చెప్పా రు. విద్యార్థులు హాల్ టిక్కెట్లు టీటీటీ.డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యుటీజీఓఆర్.జీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్ష ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు ఉంటుందని, ఎగ్జామ్స్ సెం టర్లకు గంట ముందుగా చేరుకోవాలని, ఆయా కేంద్రాల్లోకి ఎటువంటి గాడ్జెట్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు తమవెంట తీసుకురావొ ద్దన్నారు.

'ప్రభుత్వం, పాలనపై పట్టులేని సీఎం'

డోర్నకల్, ఏప్రిల్ 27 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభద్రతాభావం వెంటాడుతోందని, దీంతో ఆయన ప్రభుత్వం, పాలనపై పట్టు కోల్పోయారని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ విమర్శించారు. డోర్నకల్ మండలంలోని ఉయ్యాలవాడ, గుర్రాలకుంట, చాంప్లాతండా, కస్నాతండా, పాతదుబ్బతండా, కొత్తదుబ్బతండా, రాముతండా, లింబ్యాతండా, గొల్లచర్ల, పకీరాతండా, పెరుమాండ్ల సంకీస, జోగ్యతండా, బొడ్రాయితండా, మల్లాయికుంట తండాల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షులు నున్న రమణ, బాలు నాయక్, బిక్షంరెడ్డి, నున్న మల్లికార్జున్, పాండునాయక్, ధనియాకుల రామారావు, నున్న జగన్, శంకర్‌కోటి, వెంకట్రాం, జామ్లీ, అమరేందర్, కాసం వెంకన్న, తుమ్మ వెంకట్‌రెడ్డి, గమ్మి, రాజు, మోహన్, వెంకన్న పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

కురవి, ఏప్రిల్ 27 : దేశంలో 400 స్థానాలతో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని శక్తి కేంద్రాల డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మారపు వెంకన్న అన్నారు. కురవిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూత్ అధ్యక్షులతో బాధ్యులు ఇంటింటికి తిరిగి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈనెల 28, 29, 30 తేదీల్లో ప్రచారాన్ని ఉధృతం చేసి బీజేపీ అభ్యర్థుల గెలుపు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ కొంతం పెంటయ్య, బుక్క శంకర్‌రావు, కోడిరామకృష్ణ, కొంతం వెంకటేష్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలి

• ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య

కొత్తగూడ, ఏప్రిల్ 27 : ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేస్తానన్న బీజేపీ పార్టీని ఓడించాలని, ఎన్డీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య పిలుపునిచ్చారు. లడాయిగడ్డలో ఉపాధి హామీ కూలీలతో ఐలయ్య మాట్లాడారు. ప్రజా పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధిహామీ పథకంను బొంద పెట్టేందుకు మోదీ ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. అందులో భాగంగానే బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకంకు నిధుల కోత విధించారని పేర్కొన్నారు. మురళీ కృష్ణను గెలిపించాలన్నారు. రాజమల్లు, పిట్టల దేవేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జీరో బడ్జెట్‌తో శరపంజరం సినిమా నిర్మాణం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 27 : శరపంజరం సినిమాను మహబూబాబాద్ జిల్లాలోని ఆయాప్రాంతాల్లో 95 శాతం మేరుకు జీరో బడ్జెట్‌తో రూపొందించామని డైరెక్టర్ అండ్ హీరో నవీన్ కుమార్ గట్టు శనివారం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సినిమా డైరెక్టర్ అండ్ హీరో నవీన్‌కుమార్ గట్టు

తెలిపారు. 2019లో శరపంజరం సినిమాను రెండు నిమ్నజాతుల ప్రేమకు సంబంధించిన కథను సిద్ధం చేసుకుని ప్రారంభించినట్లు చెప్పారు. ఐదేళ్ల పాటు తొర్రూరు, మహ బూబాబాద్, బయ్యారం, పెద్దముప్పారంతో పాటు మంచి లోకేషన్లలో చిత్ర షూటింగ్ జరిపినట్లు చెప్పారు. డైరెక్టర్, హీరో నవీన్‌కుమార్‌గట్టు, హీరోయిన్ లయ, కెమెరమెన్‌లు మస్తాన్, తిరుపతిలు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మం డలం అమ్మపురం గ్రామానికి చెందినవారేనని, విలన్ మేరుగు మల్లేష్‌గౌడ్ గుర్తూరుకు చెందినవాడని చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ మాలిక్ వరంగల్‌కు చెందినవారని, ఈ చిత్రంలోని పాటలను మానుకోట ప్రసాద్ ఆలపించారని పేర్కొ న్నారు. ఈ సినిమాను ప్రతి ఒక్కరు థియేటర్లలో చూసి తమను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సంస్కృతిక సెక్రటరీ దయానంద్, రామరాజు యాకన్న, కొండ శ్రీను, సోలం సహదేవ్, ఎలేందర్ పాల్గొన్నారు.

తునికాకు కట్టకు పెరిగిన ధర

కొత్తగూడ, ఏప్రిల్ 27 : తునికాకు 50 ఆకుల కట్టకు రూ.3.03 చెల్లించేందుకు కాంట్రాక్టర్లు అంగీకరించారు. శనివారం కొత్తగూడలోని పాలడుగు కృష్ణ స్మారక భవనంలో పోరాట కమిటీ ప్రతినిధులకు తునికాకు కాంట్రక్టర్లకు ధర పెంచటంపై చర్చలు జరిగాయి. గతంలో తునికాకు కట్టకు రూ3.01 ఉండగా అదనంగా 2పైసలు పెంచి రూ. 3.03 చెల్లించాలని పోరాట కమిటీ ప్రతినిధులు కాంట్రాక్టర్లకు ప్రతిపాదించారు. ఎక్కువ ధర చెల్లించేందుకు కాంట్రాక్టర్లు అంగీకరించారు. తునికాకు సేకరణ సమయంలో కూలీ ప్రమాదానికి గురైతే కాంట్రాక్టరే ప్రథమ చికిత్స చేయించాలని. మెరుగైన వైద్యం కోసం తరించేందుకు వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. చర్చల్లో కాంట్రాక్టర్లు గజ్జి కొమురెళ్లి, చిట్టి బాబు, మల్లయ్య, పోరాట కమిటీ ప్రతినిధులు, సీపీఐ (ఎంఎల్) ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, జిల్లా నాయకులు భూర్క వెంకటయ్య, సూర్యం, తుడుందెబ్బ నాయకులు భూర్క యాదగిరి, ఆగబోయిన రవి,



కొత్తగూడలో కాంట్రాక్టర్లతో చర్చలు చేస్తున్న నాయకులు

సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఐ (ఎంఎల్) ప్రతిఘటన నాయకుడు ఎస్‌కే సైదులు, వివిధ పార్టీల, సంఘాల నాయకులు యుగేందర్, రాజమల్లు, గజ్జి సోమన్న, మల్లేషం, మల్లెల రాము, సందీప్ పాల్గొన్నారు.

కేసీఆర్ సభకు భారీగా తరలిరావాలి : ఎర్రబెల్లి



కేక్‌కట్ చేస్తున్న మాజీ మంత్రి దయాకర్ రావు

తొర్రూరు, ఏప్రిల్27 : బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం మాజీ శాసనసభ స్పీకర్ మధుసూదనాచారితో కలిసి కేక్ కట్‌చేసి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 28వ తేదిన వరంగల్ పట్టణానికి రానున్న సందర్భంగా నిర్వహించే రోడ్‌షోకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టు శ్రీను, సోమేశ్వర్ రావు, సీతారాములు, ప్రదీప్‌రెడ్డి, ఆర్.వెంకన్న, కుర్ర శ్రీను, దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండాలను ఎగురవేయాలి : సీపీఐ

కురవి, ఏప్రిల్ 27 : కార్మికుల హక్కుల దినోత్సవం మేడేను పురస్కరించుకుని గ్రామగ్రామాన ఎర్రజెండాలు ఎగురవేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కురవి సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 138వ మేడే ఉత్సవాలను గ్రామగ్రామాన, వాడవాడల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. మేడేస్ఫూర్తితో కార్మికులకు అనేక హక్కులు అందుబాటులోకి వచ్చాయని, ఎర్రజెండా కార్మికులు పోరాటాలు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కర్నం రాజన్న, మారగాని బాలకృష్ణ, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, పోలెపాక వెంకన్న, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, రవి, అప్పాల వెంకన్న, ఎన్.గురువయ్య పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండుగ

మరిపెడ రూరల్, ఏప్రిల్ 27 : మండలంలోని ఆనేపురంలో ముత్యాలమ్మ పండుగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మ ఆలయ దాత, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లికంటి యాకన్న మాట్లాడుతూ గ్రామంతోపాటు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారన్నారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురవాలని, పిల్లపాపలు ఆరోగ్యంగా ఉండాలని ముత్యాలమ్మ దేవతను కోరుకున్నారన్నారు. అనంతరం దేవాలయం ముందు జంతుబలులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజావైద్యుడు మంద వెంకన్న, తాజా మాజీ సర్పంచ్ దామెర వీరన్న, నాగన్న, బీసీ సెల్ మండల అధ్యక్షుడు మల్లికంటి రాజు, శ్రీనివాస్, గంధశిరి కృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలి

పెద్దవంగర, ఏప్రిల్ 27 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు మెట్టు శ్రీనివాస్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడారు. మాజీ పాలకుర్తి దేవస్థాన ఛైర్మన్ వి.రామచంద్రయ్యశర్మ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు యాదగిరిరావు, శ్రీరాం సంజయ్, శ్రీరాం సుధీర్, మనోహర్, వెంకన్న, కుమారస్వామి, సోమయ్య, కృష్ణమూర్తి, రఘు, భాస్కర్, రాజేందర్ పాల్గొన్నారు.

అప్రమత్తతతో విధులు నిర్వహించాలి

తొర్రూరు, ఏప్రిల్ 27 : వేసవి కాలంలో విద్యుత్ సిబ్బంది ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని మహబూబాబాద్ జిల్లా సర్కిల్ సీనియర్ ఇంజనీర్ జె. నరేష్ అన్నారు. శనివారం సాయంత్రం తొర్రూరు డివిజన్ కేంద్రంలో తొర్రూరు, చిన్నవంగర, పెద్దవంగర గ్రామాల్లోని సబ్‌స్టేషన్‌ల పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్‌ల నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సాంకేతిక అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ విధులు చేపట్టాలని, ప్రజలకు, రైతులకు ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని సూచించారు. ప్రమాదాల నివారణ, సాంకేతిక అంశాలపై కూలంకషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉన్నతాధికారులు సునీతాదేవి, మధుసూదన్, చలపతిరావు, ఏఈలు వంశీ, యాకన్న, రమేష్‌బాబు, సీనియర్ లైన్ ఇన్స్‌పెక్టర్‌లు, లైన్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ కార్యాలయం తనిఖీ

తొర్రూరు, ఏప్రిల్ 27 : వరంగల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ అధికారులు గత నెల రోజులుగా నమోదు చేసిన కేసులు, స్వాధీనం చేసుకున్న మద్యం తదితర వివరాలను వరంగల్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఐఆర్ఎస్ దిలీబన్ శనివారం తొర్రూరు ఎక్సైజ్ కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలోని వివిధ మండలాల్లో నమోదైన కేసులు, బైండోవర్‌లు తదితర వివరాలు తెలుసుకుని సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ రావు, సూపరింటెండెంట్ ప్రవీణ్, తిరుపతి, అనిల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేలుబెల్లిలో గడ్డివాము బుగ్గి

కొత్తగూడ, ఏప్రిల్ 27 : ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని గడ్డివాము దగ్ధమైన సంఘటన వేలుబెల్లిలో శనివారం రాత్రి జరిగింది. బాధితుల వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన తోలెం పద్మ మూడెకరాల్లో వ్యవసాయం చేసింది. ధాన్యం తరలించగా గడ్డిని వాముగా పేర్చారు. రాత్రి ప్రమాదవశాత్తు మంటలుఅంటుకుని గడ్డివాము దగ్ధ మైంది. సుమారు రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు.